ఈఎంఆర్ఐలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి పరిధిలోని ఈఎంఆర్ఐలో సీపీఆర్ అవగాహన రోజును శనివారం నిర్వహించారు. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కలిపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ... భారతరత్న మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సీపీఆర్ అవగాహన రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఆర్ వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీపీఆర్ ఎప్పుడు... ఎలా చేయాలి వంటి విషయాలను వివరించారు. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ, ఐపీఎస్ అధికారి వెంకటేషం, ఈఎంఆర్ఐ అధికారులు రమణారావు, ఖలీద్,జాన్ షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడతామని వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 5 వ వార్డులోని ఓం సాయినగర్ శివసాయి ఎన్‌క్లేవ్‌లో సుమారు రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించండి


చైర్ పర్సన్, కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలను బెడదను అరికట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. పలు వార్డులలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల ప్రజలపై కుక్కల దాడులు ఎక్కువయ్యాయని మున్సిపాలిటీలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు కోరారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలాం


అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవుషాపూర్ అబ్దుల్ కలాం పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... శాస్త్రవేత్త, విద్యావేత్త, రాష్ట్రవేత్తగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండని యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, మల్లేశ్, సదానంద్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, సందీప్, సత్యనారాయణ, భాను యాదవ్, సాయిలు, ప్రవీణ్, సలీం, ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు కల్పిస్తాం


శ్మశానవాటికను పరిశీలిస్తున్న దీపక్‌జాన్ తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో ఉన్న కీసర మండల క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. శనివారం క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌ను ఆయన సందర్శించారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి స్థానిక బరియల్ గ్రౌండ్ ప్రెసిడెంట్ పి.హర్షవర్ధన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేనేజింగ్ డైరెక్టర్ పి.సబిత, మేడ్చల్ డీఎండబ్ల్యూఓ అధికారి వీణాక్రాంతి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, అహ్మద్‌గూడ బరియల్ గ్రౌండ్ వైస్ ప్రెసిడెంట్ మాదాసు, సెక్రటరీ రేవసాల్మన్‌రాజు, ట్రెజరర్ రేవ గాబ్రియల్, జాయింట్ సెక్రటరీ పాల్ డేవిడ్, రేవ రాబర్ట్ సేన్, అనంతరం బరియల్‌గ్రౌండ్ కమిటీ ఆధ్వర్యంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీ చైర్మన్ దీపక్‌జాన్‌ను ఘనంగా సత్కరించారు.

దానకిశోర్‌ను కలిసిన అదనపు కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తెలంగాణ సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అండ డైరెక్టర్ వీపీ గౌతమ్‌లను శనివారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)రాధికా గుప్తా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె పుష్ప గుచ్ఛాలను అందజేశారు.


నియామకం


నియమాక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దండు శ్రీకాంత్ నియమితులయ్యారు. మేడ్చల్‌కు చెందిన శ్రీకాంత్‌ను జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తికుమార్ నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

232 చెరువులు.. చేప పిల్లలు 68.05 లక్షలు!

- వారం రోజుల్లో పూర్తి కానున్న టెండర్ల ప్రక్రియ
- ఆగస్టు మూడో వారంలో చెరువుల్లోకి చేప పిల్లలు
- 83 మత్స్య సహకార సంఘాలలో 3,773 మంది సభ్యులు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో ఆయా చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచేందుకు జిల్లా మత్స్యశాఖ చర్యలు తీసుకుంటోంది. మత్స్యకారులకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 232 చెరువులు, కుంటలు చేప పిల్లల పెంపకానికి అనువుగా ఉన్నాయని జిల్లా మత్స్య శాఖ గుర్తించింది. అందుకు తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించింది.

గతేడాది 91 లక్షల ఉచిత చేప పిల్లల పంపిణీ...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 352 చెరువుల్లో ఉచితంగా 91 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80–100 ఎంఎం) 13.50 లక్షలు కాగా, చిన్న సైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ పేర్కొంటోంది.

- ఈ నేపథ్యంలోనే 2024–25వ సంవత్సరంలో 232 చెరువుల్లో 68.05 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ మేరకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కానున్నట్లు జిల్లా మత్స్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.
- ఆగస్టు మూడో వారం నుంచి గుర్తించిన చెరువులు, కుంటల్లో చేప పిల్లలను ఉచితంగా వదిలేందుకు చర్యలు తీసుకుంటోంది.

80–100 మి.మీ చేప పిల్లల పంపిణీ...

చెరువుల్లో వదిలేందుకు 68.05 లక్షల చేప పిల్లల్లో 35–40 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు, 80–100 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు ఉన్నట్లు మత్స్య శాఖ పేర్కొంటోంది. ఇందులో నాలుగు రకాలు (తెగలు) చేప పిల్లలు ఉన్నాయి.

83 సంఘాల్లో 3,773 మంది సభ్యులు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 83 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 3,773 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం ద్వారా మత్స్యకారుల ఉపాధి, వారి ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ అధ్వర్యంలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచుతోంది.

త్వరలో చేప పిల్లల పంపిణీ



మత్స్యకారుల ఆర్థిక పురోగతి నిమిత్తం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలివేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారం రోజుల వ్యవధిలో చేప పిల్లలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. కలెక్టర్ ఆదేశాలతో గుర్తించిన 232 చెరువుల్లోనే చేప పిల్లలు పంపిణీ చేస్తున్నాం. ఆగస్టు మూడో వారం నుంచి చేప పిల్లలను చెరువుల్లో వదులుతాం.

– పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా


నాగారంలో కాటమయ్య బోనాలు


అహ్మద్‌గూడలో...

అంబరాన్నంటిన బోనాల సంబురం

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన బోనాల జాతర మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతోంది. గ్రామాలు, పంచాయతీలు, పురపాలక, నగర పాలక సంఘాల పరిధిలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారుతున్నాయి. శివసత్తుల నృత్యాలు, ఫలహారం బండ్లతో జాతర నేత్రపర్వంగా సాగుతోంది. అమ్మవార్లకు భక్తులు బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు.

– మేడ్చల్ జోన్ బృందం


నాగారం కృష్ణవేణి స్కూల్‌లో...


చిర్యాల ఎస్ఆర్‌ప్రైమ్ స్కూల్‌లో...


నాగారం సెరినిటీ పాఠశాలలో...


మునీరాబాద్ ఎస్‌కేఎం పాఠశాలలో...

స్టార్టప్ వైపు అడుగులు వేయాలి

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: టెక్నాలజీ ప్రపంచంలో ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్టార్టప్ కంపెనీల ఏర్పాటు వైపు అడుగులు వేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు ఎల్‌టీఐ మైండ్ ట్రీ డైరెక్టర్ సీతారాం వేలరి, శ్రీలంక మొరటోవ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబోధ చార్లెస్‌లు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్ రెడ్డి, సీఎంఆర్ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి, సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

ఎమ్మార్‌సీఈలో గ్రాడ్యుయేషన్ డే

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ శాలినీరెడ్డి, మెడికల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రీతి రెడ్డి పాల్గొని విద్యార్థులకు గ్రాడుయేట్ పట్టాలు అందజేశారు. విద్యార్థులు ఇంజినీరింగ్‌తో తమ విద్యను ఆపకుండా ఉన్నత చదువులు చదవాలని కోరారు. విదేశాల్లో చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశానికి సేవలందిచాలన్నారు. కళాశాల డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పట్టాలు పొందిన విద్యార్థులతో ప్రీతిరెడ్డి, అధ్యాపకులు

వీధి కుక్కల బెడదను అరికట్టాలి

అక్కినేని అమలను కలిసిన మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ శాంతి శనివారం ప్రముఖ బ్లూ క్రాస్ సొసైటీ చైర్మన్, ఫౌండర్ అక్కినేని అమలను మాదాపూర్‌లోని కార్యాలయంలో కలిసి జవహర్‌నగర్‌లో కుక్కడ బెడద, ఇటీవల బాలుడిపై చోటుచేసుకున్న కుక్కల ఘటనను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ... జవహర్‌నగర్‌లో వీధి కుక్కలు చాలా ఉన్నాయని, వాటి బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించి వారిలో మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. అనంతరం అమల మాట్లాడుతూ... జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో బాలుడు మృతిచెందడం బాధాకరమన్నారు. తెలంగాణలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ తోడ్పడుతున్నదన్నారు. కుక్కలకు సంతానోత్పత్తి నివారణ ఆపరేషన్ చేయించాలని, క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. అదేవిధంగా వీధి కుక్కల ఫర్టిలైజేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, కమిషనర్లు తాజ్ మోహన్‌రెడ్డి, రామలింగం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


అక్కినేని అమలతో మేయర్లు శాంతి, అజయ్‌యాదవ్, కమిషనర్లు

జల్సాల కోసం స్నాచింగ్‌లు

- ఆరు చైన్ స్నాచింగ్ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చినా మారని తీరు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

కీసర: జల్సాల కోసం ఒంటరి మహిళలే లక్ష్యంగా స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కీసర పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండుకు తరలించారు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... ఈ నెల 22న నాగారం వెంకటేశ్వర్‌నగర్ కాలనీలోని స్వరూప(65) అనే వృద్ధురాలు మెడికల్ షాప్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తోంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రం గొలుసు తెంపుకొని పారిపోయిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం రాంపల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించాడు. పోలీసులు అతడిని జవహర్ నగర్‌కు చెందిన సందీప్‌చారి(25)గా గుర్తించారు. సందీప్‌చారి 2021వ సంవత్సరంలో జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు చైన్ స్నాచింగ్‌లు చేసి జైలుకు వెళ్లాడు. అయినా అతని తీరు మారలేదు. గొలుసు దొంగతనాలతో పాటు పగటిపూట తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేసి బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరించారు.

సీపీఆర్‌పై మరింత అవగాహన కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సాక్షి, సిటీబ్యూరో: ఆకస్మాత్తుగా శ్వాస ఆగిపోయిన వారికి సీపీఆర్ పద్ధతిలో ఛాతీ మీద ఒత్తిడి చేయటం ద్వారా వారిని ప్రాణపాయం నుంచి కాపాడవచ్చని ప్రజల్లో విస్తృతంగా ప్రచారంతో కూడిన అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికా గుప్తా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో 'నేషనల్ కార్డియో పల్మనరీ రిససిటేషన్ దినోత్సవం'పై కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టటం గర్వకారణమన్నారు. సీపీఆర్ ప్రాముఖ్యతను గుర్తించటంతోపాటు సాంకేతికతలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అన్నీ వర్గాల్లో విస్తృత ప్రచారంతోపాటు అవగాహన పెంచాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ టి. రఘునాథ్ స్వామి మాట్లాడుతూ... సీపీఆర్‌పై ప్రజలు తక్షణం స్పందించాల్సి విషయాలు, ప్రాముఖ్యతను పేర్కొన్నారు. కార్డియో పల్మనరీ రిససిటేషన్ అందించి, 108 అంబులెన్స్‌కు కాల్ చేస్తే పది కేసులలో ఐదుగురు ప్రాణాపాయంతో బయటపడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ సందర్భంలో ప్రాణాలను కాపాడటానికి అత్యంత కీలకమైన ప్రాథమిక ప్రక్రియ అయిన కార్డియో పల్మనరీ రిససిటేషన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పొందడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాల ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వటంతోపాటు అవగాహన కల్పించారు.